


చంద్రునులో ముఖ్యాంశాలైన మంచు సుధ, కరిగి సోనలై, వాకలై, విస్తారంగా ప్రవహించునట్టు రోదసినంతా ఆవరించిన చల్లని పులకరించే వెన్నెల...ఆ వెన్నెల వెదజల్లిన అనిర్వచనీయ సౌందర్యాన్ని సమ్మోహిత మైనట్టు, నిశ్చలంగా నిశ్శబ్దంగా వున్న విశ్వం...ప్రకృతి ఆ సౌందర్యానికి ముగ్ధవై వుచ్ఛ్వాస నిశ్వాసాలనే బిగబట్టి ఆనందిస్తోందా? ... యెక్కడి నుంచో, యెక్కడికో, తీయని తావులు అందీ అందకుండా ప్రయాణం చేస్తున్నాయి...చంద్రుడు తనచల్లని కరాలతో నిద్రలో మధుర స్వప్నాలు కంటున్న కంటున్నవారిని జో కొడుతున్నాడు... కానీ యీ వెన్నెల మూలంగా నిద్రపోతూవున్న ప్రేమ స్మృతులు మేల్కొంటున్నాయి... ... ...

... ... "శకుంతలకు నీమీద మనసు నిలిచిందిబాబూ!" అన్నది ఆమె...అదే విధంగా నాప్రేమను శకుంతల కామె వ్యక్తపరిచివుండవచ్చు...ఆమెతోడ్పాటే లేకుంటే మాకథ వొకఅడుగు కూడా ముందుకువేసేది గాదేమో ... శకుంతల నాగదిముందు వున్నయింట్లో దిగినప్పట్నుంచీ ఆవిడిమీదే లగ్నమైంది నామనసు...చూపులుమాత్రం కలిసేవి అప్పుడప్పుడు... నే వుంటున్నగది యజమానురాలు నామీదున్న వాత్సల్యం చొప్పున నాకు ప్రోద్బలమిచ్చింది. శకుంతల రాకపోకలు సాగుతున్నాయి యీ యింటికి ...చొరవ చెయ్యలేక పోయాం యిద్దరమూను...అంతా ఆమెపుణ్యమే. ఆపున్నమ రేయిగాక పోయినా పైరెండవరోజున కల్పించింది అవకాశం. యీనాడు అదే రోజు. అందుకే...ఆరోజున ఆముగ్ధత్వం యెలా మరిచిపోవడం?...ప్రౌఢత్వంకన్న మాగ్ధత్వంలో యెంత మాధుర్యమున్నదీ! ...అన్నీ అమాయకపు కబుర్లే...ఐనా

శకుంతలలో సౌందర్యపిపాస వుండడం నా అదృష్టమేమో...

"యీ వెన్నెల సౌందర్యం యెంత అపూర్వమో చూశావా రావూ? అసహ్యమైన, అంద వికారమైన వస్తువులుకూడా వెన్నెల పూసిన వెండిపూతకు తళతళలాడుతునాయ్! ప్రాణంలేని వస్తువులే వెన్నెల భావంవల్ల సౌందర్యం ధరిస్తుంటే యిక సచేతన వస్తువుల్లో మార్పురాదూ? ...యీ సువాసనలు, యీ నిర్మలత్వం మందే అదృష్టం!"

ఆసౌందర్యమూర్తి భావాలు సుందరమైనవని యెంతో ఆనందించాను. శకుంతలే గాదు... నేనే గాదు... ఎవ్వరూ యీ కౌముది ప్రభావంనుంచి తప్పించుకోలేరు...మౌనంగా నేనూ శకుంతలా చెట్టాపట్టాలు వేసుకుని నడుస్తుంటే ఆ తోటలోని దృశ్యం చూస్తుంటే మాహృదయాలు ఆనందంతో నిండిపోయాయి... అన్నిటికన్న కొబ్బరిచెట్ల ఆకులు యెలా తళతళ మెరిసిపోతవి వెన్నెల్లో!...అలా చేతుల కందని ఆ చంద్ర కాంతినంతా పొదివి పుచ్చుకుని... అనుభవిద్దామని నాలుగు చేతులూ ఆరాటపడ్డాయి... నాలో వొకకోరిక ఆసమయంలో గంతులు వేసింది...శకుంతల చెవిలో వూదాను...కాదన్నది... కోపగించి నట్టుగా నటించింది...బతిమాలింది. నేను పట్టు పట్టాను... వెన్నెల్లో, వెన్నెలను మించిన కాంతితో శకుంతల శరీరం మెరిసిపోయింది...యక్ష కన్యలో కూడా ఆ దేహసౌష్టవం వుంటుందా?...ఆ గుండ్రని భుజాలు...సన్నని నడుం, మత్తెక్కించే వొంపులు...నగ్న సౌందర్యం నాచేతులకు దొరికినందువల్ల ప్రపంచంలో అందరికంటె గొప్పవాణ్ణి! వూహించగలవా ఆ అందాన్ని...? "మాసొత్తు" అంటూ నాచేతులు ఆ అనాచ్ఛాదిత అందాన్ని పెనవేసినై......

......యీ అనంతమైన వెన్నెల్లో, అంతటా ప్రశాంతత ఆవరించివున్న ఆసమయంలో, అందరూ సుషుప్తావస్థలోవున్న యీ వేళలో, యేకాంతంగా కూచుని, ఆ అలభ్యసౌందర్యానికి తన్మయం చెంది వున్న నా ఆత్మ శరీరాన్నుంచి విదలించుకుని బయటపడి, రెక్కలు కట్టుకుని చంద్రకిరణాల వెంట పైకెగిరి, స్వర్గపు టంచులవరకూ విహారం చేద్దామని గిజగిజలాడుతోంది. నాలో క్షణక్షణం వుత్పన్నమై వూహించలేని వేగంతో, వుధృతంగా పరుగెడుతుంటే వాటిని పట్టుకుని చాలని పదజాలంలో యిరికించలేను. యీ ఆనందోద్రేకాన్ని అనుభవించలేని వారికి అవి వ్యర్థంగాతోచవచ్చు...సౌందర్యం అనుభవించ నోచుకోగల రసాత్మ వుండడం సౌభాగ్యంగాదూ?... కళాకారుడు వినిపించే మధురాలాపన సౌందర్యం...ఆ ఆలాపన వినాలంటే నీలో నిశితత్వం, వివేకం, కల్పనా చతురత వుండాలి...

సౌందర్యానికీ శృంగారానికీ వున్న చుట్టరికంవల్లనేగామోలు సౌందర్యానుభూతి కలిగిన వెంటనే శృంగారం జ్ఞప్తికి వస్తుంది...శృంగారం వొక నిషిద్ధ వస్తువుగా తలిచే వారినీ, శృంగారమంటే కేవలం కామతృప్తికి పర్యాయ పదమని భావించే వాళ్ళనీ, వెన్నెలస్రవంతి తాకలేదు...ఆ సౌందర్యానికి వాళ్ళు జ

...అక్కణ్ణుంచి, ఆ బురదలోంచి, పై కెగరలేను...గత ప్రణయ గాథల్ని మనసు-యీలోకాన్ని ఆక్షణంలో మరిచిన మనసు-పునశ్చరిస్తోంది......

......శకుంతల కూడా యిలాగే అనేది... "అందరూ సౌందర్యాన్ని అనుభవించలేరు. అందాన్నానందించగల వాళ్ళు కొద్దిమందే! అదీవొకవిశేషమే!" అవును...అందులో అబద్ధంలేదు. నిజంగా యెక్కడ సంపాదించింది శకుంతల యీ సంస్కారం అని ఆశ్చర్యపడేవాణ్ణి. ...చలం పుస్తకాలు చదివిందా ?... భోగంపడుచుకా హృదయ సౌందర్యమెక్కడిదని నాబూర్జువా అహంకారం లోన గొణిగేది...వెన్నెల రాత్రిన ప్రారంభమైన ప్రణయం సాగింది ముందుకు...శకుంతల తల్లి చూచీ చూడనట్లు వుండడం మరీ విచిత్రం... యింటావిడ దగ్గర కొచ్చినట్లు రావడం... ఆరాక కోసమే యెదురుచూస్తున్న నాచేతుల్లోకి వాలిపోవడం...రోజులు యెంతత్వరగా దొర్లిపోయాయో! పరీక్షలు, కాలేజి, అన్నీ మరిచిపోయాను ఆమైకంలో... ముఖ్యంగా దీపావళిరోజు మరిచిపోలేను ...యిద్దరం రూం ముందు నిల్చుని నవ్వుతూ, అల్లరిచేస్తూ, బాణాసంచా కాలుస్తోంటే, మాప్రణయానికి దోహదమిచ్చిన యింటి యజమాను రాలెంత ముచ్చటపడింది...! ముచ్చటపడి మనసారా దీవించింది మాప్రేమ కాటంకం కలగరాదని...

నేతెచ్చే పుస్తకాలు, పత్రికలు, ఒక్కటాన్నీ వదిలేదుకాదు శకుంతల...నేకాలేనవేళల్లో అవే ఆవిడ సహచరులు ...రాత్రుల్లో ఆ కథలు, రాజకీయాలు గురించి వాదనలతో కాలమే మరిచే వాళ్లం...తర్కంలో గట్టిచెయ్యే... సినిమాలంటే పిచ్చిసరదా... నాగదిలో "ఆర్డర్" యేమాత్రం చెడినా సహించేది గాదు...నేనేగాక, నాకు చెందిన ప్రతి వస్తువుమీదా తీరని మమకారం, శకుంతలకు...

"మగవాళ్లంతా యింతే! ఆడాళ్లు కన్పిస్తేచాలు యెక్కడలేని నిర్లక్ష్యం, బద్ధకం తెచ్చుకుంటూరు...గది యెప్పుడూ అలా చిందరవందరగా వుంచుతా వెందుకు?... నీకు కావాల్సిన విషయాలమీద కూడా శ్రద్ధవుండదేం" అనిమందలించేది అప్పు డప్పుడు...నిజమే... మగవాళ్లకు ఆడవారికున్న శుభ్రత, వోర్పు, అబ్బవు ...అందుకే జోత్స్నలోని నిర్మలత్వానికీ, అందమైన స్త్రీలకూ అంత సామీప్యం...అయితే వెన్నెలకు సొగసు శకుంతల చేకూరుస్తుందో, వెన్నెల శకుంతలకు చేకూరుస్తుందో చెప్పలేను...

వెన్నెల కాంతి పులుముకుని ఆఖరికి మోడుకూడా అదోవిధమైన సొంపును పొందాయి... చెట్లనీడలు గంభీరంగా, నిడుపై, బాటలమీద వింతనగిషీలు చెక్కుతున్నాయి. మిలమిలలాడే పచ్చని ఆకులుచూస్తుంటే కదల బుద్ధిగాదు... దాని రంగు అలేఖ్యంగా వున్నది... తెలుపు, నీలిమ కలిసివున్న రంగు అవధులు లేకుండా అనంతంగా ఆకాశమంతటా వ్యాపించివుంది. ఆ నిశ్చలత్వంలో నడుస్తూముందుకు సాగిపోతూవుంటే, పంచమస్వరంలో పాడే కోయిలకంఠం, సితార్ నుంచి వచ్చే మధురస్వరాలు

వొకదానిలోంచి వొకటి విడదీయ వీలు లేకుండా సమ్మేళనమైనప్పుడు పుట్టిన గాన వాహినిలోంచి కదిలివచ్చే అలలమీదుగా పరవశత్వంతో, వూహాజగత్తులో తేలి పోయినట్లుగా వుంది... మనసు మాటి మాటికీ వెనక్కి అడుగులు వేస్తోంది... జీవితచరిత్ర పుటల్ని క్రమంతప్పించి గజి బిజిగా తిరగ వేస్తోంది..................

......నాకప్పుడు యెనిమిదేళ్ళుంటా యేమో... ఆఅమ్మాయి. పేరుపూర్తిగా మరిచి పోయాను... "నువ్వెంత బాగు న్నావ్?" అంటూ చిన్నారి చేతుల్లో నన్ను బంధించి, గిర్రున తిరిగేది ఆనం దంతో . యెవరూ లేనప్పుడు జూసి...

పన్నెండేళ్ళప్పుడు...... వొక్కణ్నే మంచమ్మీద కూర్చుని చదువుకుంటో వుంటే, రుక్మిణి (ఆ అరవ అమ్మాయి పేరదే అని నమ్మకం) నన్నానుకుని కూచుని. కావాలని నామీద పడుతూ, కేరింతాలు కొట్టేది......లైటుకాంతిలో వొక్కో సమయాన ఆశతో, దీక్షతో, చూసేది నాముఖాన్ని...నాకర్థమయేలా గాదు......వొకటి రెండు సంవత్సరాది తర్వాత అనుకుంటాను నేను, యింకా యిద్దరు ముగ్గురు స్నేహితులు పోస్టు మాష్టరు యింటికివెళ్ళే వాళ్ళం...వాళ్ళ అబ్బాయికీ మాకు జోస్తీవుండటంవల్ల... అతడి అక్కయ్య బొద్దుగా వుండేది... చెప్పుకోదగిన అందంగాదు...స్నేహితు లెవరూలేని సమయాన నాసరసనకూర్చుని "నువ్వెంత ముద్దొస్తావూ? నిన్నుచూస్తుం టే..." అంటూ కళ్ళతో కోరిక తెలియ పరుస్తూ బుగ్గలు స్పృశిస్తే, నాలో భయం, ఆనందం ముప్పిరిగొనేవి...

యెందు కిలాంటి విషయాలు అంతగా హృదయంలో నాటుకుని వుంటాయి? బాల్యంలోని విషయాలన్నీ జ్ఞాపకముం డవు...కొన్నికొన్ని సంఘటనలుమాత్రం అలాగే నిలిచిపోతవి...ఐనా వీటన్నిటినీ మించినది శకుంతల స్మృతి...మనసు పదే ఆఘట్టానికి సంబంధించిన పుటల్నే తిరగ వేస్తోంది.

శకుంతలకీ సంఘటనలు కొన్ని తెలియ పరిచాను. అల్లరిపనిచేసిన కుర్రవాడిని మందలించే మేష్టారి ముఖవాలికలతో, "అమ్మదొంగా! గ్రంథసాంగుడివే! చాలా వుందే చరిత్ర! యివన్నీ బాల్యక్రీడలా?" అని తెల్లని సున్నితమైన వేళ్ళతో నా బుగ్గగిల్లి కిలకిలమని నవ్వేది...యెన్నడూ వాళ్ళమీద అసూయ ప్రకటించలేదు. నిజంగా దేవతే అనాలి. శకుంతల, నా మధ్యజరిగే ప్రేమకలాపాలు గ్రహించిన ఆవిడపిన్నమ్మ నన్ను పొందాలని చాలా ప్రయత్నించింది ... యింటి యజమాను రాలి ద్వారా చూచాయగా కోర్కె వెలి బుచ్చింది. నేను యీసడించాను. పట్ట లేక చివరి కెదటబడి అడిగిందిగూడాను. "మీకు శకుంతతే గావాలేం? ... నేను అక్కర్లేదా?" అని... నేను... "అవు నంతే!" అని నిరంగీకారం సూచించాను. యేవేవో సూటిపోటి మాటలన్నది. నే నాలకించ లేదు. అప్పటికీ ఆవిడ పట్టు వదల్లేదు. వొకరోజురాత్రి హఠాత్తుగా నారూములోకి వచ్చింది...నాకు యేమీ తోచలేదు...యింటావిడకూడా లేదు... యిక లొంగవలసిందేనా?...యెందుకంటే ఆసమయంలో యెవరూ తప్పించుకో లేరు. ఐతే తప్పించుకున్నాను. దేవ

ఆమె రావడం మూలాన. ఔను మరి తెలిసి తెలిసి యెవరూ ఊబిలోకి దిగరు ... ఆవిడకున్న సుఖవ్యాధులు !!! నేనూ, శకుంతల, యిద్దరం మంచమెక్క వలిసేది.

యికమళ్ళీ ఆవిడ నాజోలికి రాలేదు. "బ్రతికాం దేవుడా!" అనుకొని సంతోషించాను ఆమె విరగడైందని...

పరీక్షలు దగ్గరకివస్తున్నయ్. లోలోన మనసులో వినవస్తున్నయ్ మందలింపులు ..."యీ ప్రణయం పరీక్ష కంతరాయమ"ని...సందిగ్ధమే ! యేమైనాసరే నని శకుంతల ప్రేమనుమాత్రం వొదలలేదు. అలాచేయడం నాశక్తి కతీతం...ఐనా రానేవచ్చింది. అవాంతరం ... శకుంతల వుంటున్న యింటివాళ్ళకు, శకుంతల తల్లికి పేచీవచ్చింది. నన్నూ, శకుంతలనూ వేరు పరచడానికే వచ్చింది ఆపేచీ ... యిల్లు వదిలారు వాళ్లు...శకుంతల యెంతబాధ పడిందో నానుంచి విడిపోవటానికి ... రాత్రీ, పగలు, మనసు మథనపడింది. శకుంతలకోసం ... ఆవిడచర్యలు, ఆవిడ తీయనిపలుకులు, వొక్కటొక్కటే జ్ఞాపకానికొచ్చి, హృదయాన్ని తీవ్రంగా గాయపరచేవి. యెంతమరచిపోదామన్నా నాకది అసంభవంగా తోచింది. కుమిలిపోయేవాణ్ణి ఆ వియోగబాధతో...పరీక్షలెవరిక్కావాలి నా శకుంతల నాదగ్గర లేనప్పుడు...? యెలావెళ్ళను వాళ్ళున్న యింటికి...? అభిమానాన్ని చంపుకొని, మనోవ్యథ భరించలేక చివరికివెళ్లాను... అందరూ ముక్తసరిగా మాట్లాడేరు... ఆముభావం గోరుచుట్టుపై రోకటిపోటయింది. శకుంతల యేమని మాట్లాడగలదు? ...కళ్ళతో తనవ్యథనంతా వెళ్ళబోసింది. నేను వచ్చేస్తుంటే చెప్పింది రుద్ధకంఠంతో "యిక మనప్రేమకు విచ్ఛిత్తే!...నన్ను మరిచిపో!" అని...నాకు దూరమై పోయింది...యెందుకుఅంటే చెప్పలేని కారణాలు.

యిక నాకాదేవత అలభ్యం...గతమంతా మరచిపోగలగడం సాధ్యమేనా? ...అందుకని ఆవూరు వెళ్ళినప్పుడల్లా నాకాళ్లు అప్రయత్నంగా అటేదారి తీస్తాయి...కళ్లు ఆతురతతో వెదుకుతాయి యే అనిర్వచనీయ సౌందర్యరాశి కోసమో...వృథా...యికవృథా!

మిత్రుడు రాజు అంటూంటాడు. "పోస్టాఫీసు వీధివేపు వెళ్తున్నావా?" అని నవ్వుతో...అతని కర్థమవుతుందా యిదంతా?...

పౌర్ణమివెళ్లిన రెండోరోజంటే అందుకే భయం. ఆప్రణయ స్మృతులన్నీ పొంగి వస్తాయి...నడుస్తున్నాను మౌనంగా... యెక్కడికెళ్లానో వూహలేదు...నడుస్తున్నాను...అంతే...వుజ్వలంగా, మహోజ్వలంగా వెలిగేవెన్నెల...ఆద్యంతాలు లేని అపారమైన వెన్నెల ... దానిలో ఐక్యమవాలని నేనూ...

* * *